నెలాఖరు లోగా పన్ను చెల్లిస్తే రాయితీ

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 10 : మార్చి 31వ తేదీలోగా ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ వర్తిస్తుందని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జిల్లాలోని ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ అధికారులు, లేఅవుట్ డెవలపర్లతో ఎల్‌ఆర్‌ఎస్ విధానంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఈనెల 31లోగా ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు చెల్లిస్తే 25 శాతం రాయితీ వస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి గ్రామాలు, వార్డుల వారీగా విభజించాలన్నారు. వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్లో నమోదు చేయాలని, దరఖాస్తు దారులకు ఫోన్‌చేసి ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకుంటే రాయితీ వస్తుందని తెలియజేయాలన్నారు. జీవో 131 మున్సిపల్ చట్టం ప్రకారం మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్లాట్లు, లేఅవుట్‌లో ఉన్న దరఖాస్తుదారులకు నూతన ఎల్‌ఆర్‌ఎస్ విధానం పై అవగాహన కల్పించాలన్నారు. రాయితీ సద్వినియోగం చేసుకునేలా చైతన్యపర్చాలన్నారు. దరఖాస్తు దారులకు హెల్ప్ డెస్క్ ఏ ర్పాటు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అనుమతి లేని ప్లాట్ల లేఅవుట్లు, స్థలాలు కొన్నవారు వినియోగించుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జడ్పీసీఈవో జానకిరెడ్డి, డీపీవో సాయిబాబా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం..

మునిపల్లి,మార్చి 10 : గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడాకారులను వెలికితీసేందుకే క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్లు ఇండియా క్రికెట్ జట్టు మాజీ చీఫ్ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని కంకోల్ గ్రామ శివారులోని ఒక్సెన్ యునివర్సిటీని సందర్శించారు. త్వరలో కంకోల్ ఒక్సన్ యునివర్శిటీలో ఎంఎస్‌కే ప్రసాద్ అకాడమిక్ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కంకోల్ ఒక్సన్ యునివర్శిటీలో మాట్లాడుతున్న మాజీ చీఫ్ సెలక్టర్ ప్రసాద్

కలెక్టరేట్ ప్రజావాణికి 57 అర్జీలు

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 10 : ప్రజావాణి సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి వారం నిర్వహించే ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 57 అర్జీలు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారులకు అందజేసి వాటి నిసకాలంలో పరిష్కరించాలని ఆమె కోరారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో రవీందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

దివ్యాంగులకు ఉపకరణాలు అందజేసిన కలెక్టర్

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 10 : ప్రత్యేక అవసరాల పిల్లలకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష పథకం, అలింకో సంస్థ ఆధ్వర్యం లో సోమవారం సంగారెడ్డి సంజీవనగర్ కాలనీలోని భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాల పిల్లలకు కలెక్టర్ ఉచితంగా సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రత్యేక విద్య, ఇంటి వద్దనే ఫిజియోథెరపీ, ప్రత్యేక ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు వివరించారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ ప్రతి వారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల్లో గుర్తించిన 102 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు, వివిధ రకాల 214 సహాయ ఉపకరణాలను అందించామన్నారు. అనంతరం వీల్‌చైర్లు, ట్రై సైకిళ్లు, వినికిడ యంత్రాలు, రోలాటర్, టీఎల్ఎం కిట్లు తదితరాలను అందజేశారు. డీఈవో వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశం, ఎంఈవో విద్యాసాగర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, ఉపకరణాలు అందజేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి

ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, మార్చి 10 : జిల్లాలో శాంతి భద్రతల రక్షణకు 24 గంటలు అందుబాటులో ఉంటానని, ప్రజలు, పోలీసులు ఎప్పుడైనా తన వద్దకు వచ్చి సమస్యలు తెలియజేయాలనని ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. సోమవారం బాధ్యతలు చేపట్టి జిల్లా పోలీస్ మైదానంలో పోలీసుల వందన స్వీకరాం చేశారు. కొత్త ఎస్పీకి ఎస్పీ చెన్నూరి రూపేష్ పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. జిల్లాలో క్రిమినల్, నేరస్తుల కదలికలపై పోలీసుల నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, ఏవోఈ కల్యాణి, డీఎస్పీలు రవీందర్‌రెడ్డి, సత్తయ్యగౌడ్, రామ్‌మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, డీఎస్పీ నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల నుంచి వందన స్వీకరిస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మనూరులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మనూరు, మార్చి 10 : మనూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 2010-11 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. ఉపాధ్యాయులు నరప్ప, సాయి బాబా, మహేశ్ కుమార్, మారుతి, ఈశ్వర్, బగువాన్‌దాస్, కిషన్ రా వు, దేవి సింగ్, విద్యార్థులు దశరథ్, బసిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, సంగారెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అందోల్‌లో..

అందోల్, మార్చి 10 : మండల పరిధిలోని నేరడిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. అప్పటి విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకున్నారు.

అందోల్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు , ఉపాధ్యాయులు

మాటలకే పరితమైన ఆరు గ్యారెంటీలు

ఝరాసంగం, మార్చి 10 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినప్పటికీ ఆరు గ్యారెంటీలు పూర్తిస్థాయిలో అమలు జరగకపోవడంతో మాటలకే పరిమితం అయ్యాయని జిల్లా యువజన మోర్చ ఉపాధ్యక్షుడు బత్తిని పాండు తీవ్ర ఆరోపణలు చేశారు. సోమవారం మండల పరిధిలోని బర్దిపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ పాలకవర్గం కాలం ముగిసి ఏడాది గడుస్తున్నా సర్పంచ్‌లు, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా మారి కార్యదర్శులు అప్పులపాల వుతున్నారన్నారు. సమావేశంలో కిసాన్ మోర్చా అధ్యక్షుడు కోట వెంకటేశం, హరీష్ పాటిల్, గోరఖ్‌నాథ్, రాజు, రమేశ్, సంతు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నారాయణఖేడ్, మార్చి 10 : నారాయణఖేడ్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నూర్జహన్‌బేగం అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని దవాఖానలో శస్త్ర చికిత్స నిర్వహించారు. విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సోమవారం దవాఖానకు వెళ్లి ఆమెను పరామర్శించారు. వెంట స్థానిక నేతలు ఉన్నారు.

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పటాన్‌చెరులో 85.43శాతం పన్ను వసూలు

పటాన్‌చెరు, మార్చి 10 : పటాన్‌చెరు మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో పన్ను వసూలు ప్రక్రియ వేగవంతమైందని మండల పంచాయితీ అధికారి హరిశంకర్ గౌడ్ అన్నారు. సోమవారం పటాన్‌చెరులోని తన కార్యాలయంలో ఎంపీవో మాట్లాడుతూ మండలంలో 11 గ్రామ పంచాయతీలున్నాయన్నారు. వాటిలో 85.43 శాతం పన్ను వసూలు పూర్తి చేశామన్నారు. రూ. 6.9 కోట్ల వసూలు డిమాండ్‌కు రూ. 5.20 కోట్లు వసూలు చేశామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఇప్పటికే ఇంటింటికి తిరిగి పన్ను వసూళ్లు వేగవంతం చేశారన్నారు. ఐనోల్, బచ్చుగూడెం గ్రామ పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూలు జరిగిందని తెలిపారు. రుద్రారం, ఇంద్రేశం, నందిగామ, భానూర్ గ్రామాల్లో పన్ను వసూలు ప్రక్రియ కొనసాగుతున్నదన్నారు. మొండి బకాయిల పైన దృష్టి పెట్టామన్నారు. పన్ను చెల్లిస్తేనే మెరుగైన సేవలు అందుతాయని గుర్తు చేశారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేసిన అధికారులు

ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేస్తున్న విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది

జహీరాబాద్, మార్చి 10 : పంట పొలాల్లో ఒరిగిపోయి పడిపోవడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సంబంధిత శాఖాధికారులు సరిచేశారు. సోమవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన ' పడిపోతే ప్రమాదమే' అనే వార్త కథనానికి సంబంధిత జిల్లా అధికారులు స్పందించారు. ఈ మేరకు మండల విద్యుత్ శాఖ ఇంజినీరింగ్ అధికారి ఆర్జున్ ఆధ్వర్యంలో న్యాల్‌కల్ మండలంలోని రుక్మాపూర్, హద్నూర్ గ్రామ శివారులోని పంట పొలాల్లో ఒరిగిపోయి పడిపోవడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేశారు. మండలంలోని గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్నా, వేలాడుతున్న తీగల గురించి తమ దృష్టికి తీసుకువస్తే మరమ్మతులు చేయిస్తామని ఏఈ అర్జున్ తెలిపారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాల గురించి 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో ప్రచురించి, సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసినందుకు ఆయా గ్రామాల రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

కార్యకర్తలను అండగా బీఆర్‌ఎస్

కొమురవెల్లి, మార్చి 10: కార్యకర్తలను బీఆర్‌ఎస్ కడుపులో పెట్టుకొని చూసుకుంటుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నాడు. మండలంలోని లెనిన్‌నగర్‌కు చెం దిన బీఆర్‌ఎస్ కార్యకర్త ప్రభాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉన్న ప్రభాకర్‌కు రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును సోమవారం ఎమ్మెల్యే జనగామలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మృతుడి భార్య దాసరి శిరీషకు అందజేశాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి కొం డంత బలం అని, ఎన్నో సమావేశాల్లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పదే పదే చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ సభ్యత్వం తీసుకొని, పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దేశంలో ఎక్కడాలేని విధంగా రూ.2లక్షల బీమా సౌకర్యం కల్పించారన్నారు. జనగామ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ శ్రేణులకు, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే పల్లా తెలిపాడు.

ప్రమాదబీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

భెల్ రక్షణలో సీఐఎస్ఎఫ్ పాత్ర కీలకం

రామచంద్రాపురం,మార్చి 10 : భెల్ పరిశ్రమ రక్షణలో సీఐఎస్ఎఫ్ పాత్ర కీలకమని భెల్ ఈడీ కేబీరాజా అన్నారు. సోమవారం సీఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి భెల్ ఈడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం సీఐఎస్ఎఫ్ జవాన్లు ప్రదర్శించిన విన్యాసాలను పలువురు తిలకించారు. సీఐఎస్ఎఫ్ జవాన్ల సేవలు అభినందనీయమని తెలిపారు. సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు ఉన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టకపోతే త్వరలో పోరాటం

అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

సమావేశంలో మాట్లాడుతున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటిక్రాంతికిరణ్

రాయికోడ్, మార్చి 10 : సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తుపోతల ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టకపోతే త్వరలోనే రైతులతో పోరుబాట నిర్వహిస్తామని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాయిపల్లి(సి)లో బీఆర్‌ఎస్ కార్యకర్తల గృహాల్లో నిర్వహించిన శుభకార్యక్రమాల్లో పాల్గొని అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సింగూర్ ప్రాజెక్టు నుంచి అందోల్, జహీరాబాద్,నారాయణఖేడ్, సంగారెడ్డి నియోజకవర్గంలో 2 లక్షల 47 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తుపోతల ప్రాజెక్టులు నిర్మాణం చేసేందుకు మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుల పనులను ఏ మాత్రం చేయకపోవడం చాలా బాధాకారం అన్నారు. వీటిపైన త్వరలో పోరుబాట నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఇందూర్ పీఏసీఎస్ చైర్మన్ హనుమంతు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు విఠల్, వరం వైస్ చైర్మన్ తుకారం, మాజీ ఎంపీటీసీ నిరంజన్,మాజీ సర్పంచ్‌లు శంకర్, చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులను చితకబాదిన ఉపాధ్యాయుల సస్పెన్షన్

కంగ్టి, మార్చి 10: మూడురోజుల కింద కంగ్టి కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఆరుగురు విద్యార్థినులను చితకబాదిన మ్యాథ్స్ టీచర్ సురేఖ, పీఈటీ రేణుకలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఇద్దరిని విధుల నుంచి తొలిగించినట్లు ఉత్తర్వులు జారీచేశారు. విద్యార్థినులపై ప్లాస్టిక్‌పైప్‌తో వాతలు వచ్చేటట్లు కొట్టడంపై 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకున్నారు.

డంపింగ్‌యార్డుతో మాబతుకులు ఆగం చేయకండి

గుమ్మడిదలలో రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం సభ్యులకు మద్దుతు ఇస్తున్న జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మార్చి 10 : డంపింగ్‌యార్డుతో మాబతుకులు ఆగం చేయకండి అంటూ రైతు జేఏసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లా, గుమ్మడిదల మండలం, నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో జీహెచ్ఎంసీ ద్వారా రాంకీ సంస్థ ఏర్పా టు చేస్తున్న డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ కొనసాగిస్తున్న రిలే నిరాహారదీక్షలు గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో 34వ రోజుకు చేరుకున్నాయి. ఇందులో గుమ్మడిదలలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, కొత్తపల్లి, నల్లవల్లి గ్రామాల సభ్యులు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా రైతు జేఏసీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, మందభాస్కర్‌రెడ్డి, శ్రవణ్, తులసిదాస్, బాల్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జూపార్కు లేదా వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలి

ప్యారానగర్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డుకు బదులు జూపార్కు లేదా వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేస్తే ఇక్కడి గ్రామాల యువతకు ఎంతో మేలు జరుగుతుందని సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజావాణిలో కలెక్టర్ వల్లూరి క్రాంతికి రైతు జేఏసీ నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. దీనికి ఆమె స్పందిస్తూ మీ దరఖాస్తును రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం.. అల్లుకుంటున్న తీగలు

ఝరాసంగం, మార్చి 10 : మండల కేం ద్రంలోని 8వ వార్డులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనకాల ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ, విద్యుత్ స్తంభాలకు పిచ్చి మొక్కల తీగలు అల్లుకున్నాయి. పక్కన మురుగు కాల్వ ఉండడంతో తీగజాతి మొక్కలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహణ పనులు పర్యవేక్షణ లోపం కారణం గా కింది స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెట్లకు కరెంట్ ప్రసారమైతే మనుషులకు, జీవాలకు ప్ర మాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి అల్లుకున్న తీగలను, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చి మొక్కలను తొలిగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సోమవారం విద్యుత్‌శాఖ ఏఈ సరళను వివరణ కోరగా, మొక్కలను తొలిగించేలా ప్రత్యే క చర్యలు తీసుకుంటామని సమాధానమి చ్చారు.

ట్రాన్స్‌ఫార్మర్,విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగలు

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

పుల్కల్, మార్చి10 : మండల పరిధిలోని సింగూరుపంచాయతీ కార్యదర్శి రంగయ్య అక్రమాలకు పాల్పడడంతో పాటు నిధుల విషయంలో దుర్వినియోగం చేస్తున్నాడని, అందుకు ఈ పంచాయతీ కార్యదర్శి మాకొద్దంటూ సింగూరు గ్రామానికి చెందిన కొందరు సోమవారం ఎంపీడీవో ఆనంద్‌మేరికి ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఏదైనా పనులకు సంబంధించి వెళ్తే డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తలపై క్రేన్ పడి కార్మికుడి మృతి

రామచంద్రాపురం, మార్చి10 : తెల్లాపూర్‌లోని ఆకృతి నిర్మాణ సంస్థలో పని చేస్తున్న కార్మికుడి తలపై క్రేన్ పడి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. కొల్లూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకృతి నిర్మాణ సంస్థలో పని చేస్తున్న బీహారుకు చెందిన మంగన్ కుమార్ (27) ఉదయం క్రేన్ వద్ద పని చేస్తున్న క్రమంలో క్రేన్ అతడి తలపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తొటి కార్మికుడు చరణ్‌మండల్ ఫిర్యాదు మేరకు ఎస్సై రవీందర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నారాయణఖేడ్, మార్చి 10: పట్టణంలోని ఓ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భం గా పౌరసరఫరాల విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశం మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణంలోని దత్తాత్రేయ కాలనీలోని జై సేవాలాల్ రైస్ డిపోలో తనిఖీలు నిర్వహించామన్నారు. 63 బస్తాల్లో నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని తదుపరి చర్యల నిమిత్తం స్థానిక తహసీల్ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పండరి, ఎస్సై వెంకటేశ్వర్లు, డీటీ ప్రభాకర్ ఉన్నారు.

ఖేడ్‌లో రేషన్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

ముగ్గురు జూదరుల అరెస్టు

అందోల్, మార్చి 10 : పేకాట స్థావరంపై దాడిచేసి ముగ్గురు జూదరులను అరెస్టు చేసినట్లు జోగిపేట ఎస్సై పాండు సోమవారం తెలిపారు. పట్టణంలోని శ్రీరామా ఫంక్షన్ హాల్ సమీపంలో జూదం ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులతో పాటు రూ. 16. 250 నగదు, పేక ముక్కలు లభించాయని తెలిపారు.

జాబ్ మేళాలో 12 మంది ఎంపిక

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 10 : టాస్క్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తారా ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 12 మంది అభ్యర్థులు ఆయా ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ తెలిపారు. ఎంఎస్ఎన్ కంపెనీలో జూనియర్ ఎగ్జిక్యూటీవ్ ట్రైనీ కోసం బీఎస్సీ, ఎంఎస్సీలో కెమిస్ట్రీ కలిగిన అభ్యర్థులకు నియామక పరీక్షలు నిర్వహించారని వెల్లడించారు. అభ్యర్థులు కోర్సు 2024, 2025లో పూర్తి చేసిన వారు 66 మంది హాజరు కాగా, 12 ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరికి వేతనం ఏడాదికి రెండున్నర లక్షల రూపాయలతో పాటు బస్, క్యాంటీన్, బోనస్, నైట్ షిఫ్ట్ అలవెన్స్ తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రతినిధులు శ్రీనివాస్, పృథ్విరాజ్, టీఎస్‌కేసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుచిత్ర సింగ్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లిక, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వల్లి సౌభాగ్యం పాల్గొన్నారు.

ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్పీ పరితోష్ పంకజ్ జిల్లా ప్రధాన న్యా యమూర్తి భవానీ చంద్ర, కలెక్టర్ వల్లూరి క్రాంతిలను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం లో బాధ్యతలు చేపట్టిన అనంతరం న్యాయమూర్తి, కలెక్టర్లను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

-సంగారెడ్డి, మార్చి 10

శుభాకాంక్షల వెల్లువ

అమీన్‌పూర్,మార్చి 10 : నూతనంగా సంగారెడ్డి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పంకజ్ పారితోష్‌ను సోమవారం పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డితోపాటు ఇన్‌స్పెక్టర్ నరేశ్ శుభాకాంక్షలు తెలిపి శాలువతో సత్కరించారు.

గణేశ్ దేవస్థానంలో ఎస్పీ పూజలు

పటాన్‌చెరు, మార్చి 10 : బాధ్యతలు స్వీకరించేందుకు వెళ్తూ జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ రుద్రారం గణేశ్ దేవస్థానంలో పూజలు చేశారు. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ వినాయక్‌రెడ్డి ఎస్పీకి అధికారికంగా స్వాగతం పలికారు. రుద్రారం గ్రామ నాయకులు, పోలీసులు, దేవస్థానం సిబ్బంది ఉన్నారు.

నేడు పటాన్‌చెరుకు మాజీ మంత్రి రాక

పటాన్‌చెరు, మార్చి 10 : నేడు పటాన్‌చెరుకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు రానున్నారు. సోమవారం పటాన్‌చెరులో డివిజన్ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 11న మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి హరీశ్‌రావు విచ్చేయుచున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ మహిళా నాయకుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

వీరభద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మన్‌గా మద్దిప్రతాప్‌రెడ్డి

గుమ్మడిదల, మార్చి10: జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామిదేవాలయ కమిటీ చైర్మన్‌గా మద్దిప్రతాప్‌రెడ్డి ప్రమాణస్వీకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయానికి ధర్మకర్తల మండలి చైర్మన్‌గా అన్నారం గ్రామానికి చెందిన మద్దిప్రతాప్‌రెడ్డిని ధర్మకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ఈవో శశిధర్‌గుప్తా ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు.

బ్రహ్మోత్సవాలకు విరాళం

రామచంద్రాపురం, మార్చి 10 : బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని కంచి కామాక్షి అమ్మవారి ఆలయ పుష్కర బ్రహ్మోత్సవాల సందర్భంగా కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి విరాళం అందజేశారు. సోమవారం అమ్మవారి బ్రహ్మోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఉన్నారు.

ఆర్థిక సాయం



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సంఘసేవకుడు ఆనంద్ కృష్ణారెడ్డి

జిన్నారం, మార్చి 10 : జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికుడు నర్సింగరావు (50) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న సంఘ సేవకులు ఆనంద కృష్ణారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి తోడుగా నిలిచిన సంఘ సేవకుడికి బాధితులు ధన్యవాదాలు తెలిపారు.

PUBLIC NOTICE

Under the instructions of my client **Mr Nilam Madhu R/o 2-57/1, Chitukul Village, Patancheru Mandl, Medak Dist** is the owner of Plot No.24 admeasuring 300 Sq.Yds & Plot No.24 part admeasuring 50 Sq.Yds in Sy.No.246 and 247 situated at Isnapur Village, Patancheru Mandal, Sangareddy District having purchased the same vide Registered Sale Deeds bearing documents No.2116 of 2021 dated 11.01.2021 & 2115 of 2021 dated 11.01.2021 from Mr. K.Venkataiah This notice is hereby given to the general public that My client has lost/misplaced his **original title deed bearing Sale deed no. 5745 of 1988 dated 12.10.1988** executed in favour of Mrs Yaruganti Bramrambhika by Mr B.Ramulu & Mr Anwar Khan the General Power of Attorney holders of Mr M.Namdev and others

Further it is informed that, any person finding the above mentioned Title deed may return the same by way of registered post to the address given below or inform the undersigned by telephone, any person/(s) having any objections, claims, right, lien, title over the said property may please contact the under signed within 7 days from the date of publication of this notice with relevant documents in support of their claim, As otherwise my client will proceed, treating no claims whatsoever in nature over the said property.

Sd/- **K.RAM RATAN REDDY**
Advocate
Office Address: Plot No. A 4/B, Ground Floor, Near KFC, Vikrampuri Colony, Secunderabad-500009.
Ph: 9390399911